పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలి



గార్బేజ్‌ కవర్లను అందజేస్తున్న డిప్యూటీ మేయర్‌

లాలాపేట: రంజాన్‌ మాసం నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లోని మజీద్‌ల వద్ద పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని, తడి,పొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోలకు అందజేయాలని డిప్యూటీ మేయర్‌ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి అన్నారు. గురువారం తార్నాకలో మజీద్‌ కమిటీ సభ్యులకు జీహెచ్‌ఎంసీ ద్వారా ప్రత్యేక చెత్తను సేకరించే గార్బేజ్‌ కవర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇఫ్తార్‌ పార్టీల అనంతరం చెత్తను ఎక్కడపడితే అక్కడ రోడ్లపై వేయరాదని సూచించారు.

దేవాలయ పనులు ప్రారంభించిన తలసాని



ఆలయ పునర్నిర్మాణ పూజలో పాల్గొన్న తలసాని

రాంగోపాల్‌పేట్‌: రాంగోపాల్‌పేట్‌ డివిజన్‌ నల్లగుట్టలోని ముత్యాలమ్మ దేవాలయ పునర్నిర్మాణ పనులను మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ ప్రారంభించారు. గురువారం తలసాని శ్రీనివాస్‌ యాదవ్‌తో పాటు మాజీ కార్పొరేటర్‌ అత్తెల్లి అరుణగౌడ్‌ తదితరులు హాజరై శాస్త్రోక్తంగా ఆలయ పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు శ్రీనివాస్‌గౌడ్‌, కిశోర్‌కుమార్‌, ఆంజనేయులు, అరుణ్‌బట్‌, సత్యనారాయణ, బస్తీ నాయకులు శ్రీనివాస్‌, నర్సింగ్‌రావు, రాజేందర్‌, రాకేష్‌, కల్యాణ్‌ తదితరులు పాల్గొన్నారు.

హ్యూమన్‌ రైట్స్‌ ప్రొటెక్షన్‌ జిల్లా ఉపాధ్యక్షుడిగా బెనర్జీ



పీపీ బెనర్జీ

పద్మారావునగర్‌: ఇంటర్నేషనల్‌ హ్యూమన్‌ రైట్స్‌ ప్రొటెక్షన్‌ కమిషన్‌ హైదరాబాద్‌ జిల్లా అధ్యక్షులుగా పీపీ బెనర్జీ నియమితులయ్యారు. నియామక పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి బుధవారం బెనర్జీకి అందజేశారు. బన్సీలాల్‌పేట్‌ డివిజన్‌ రామస్వామి కంపౌండ్‌ ప్రాంతానికి చెందిన పీపీ బెనర్జీ అనేక సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టి అమలు చేస్తున్నారు. మానవ హక్కుల గురించి ప్రజలను చైతన్యవంతులను చేయడంతో పాటు హక్కుల పరిరక్షణ కోసం చిత్తశుద్ధితో పని చేస్తానన్నారు.


అక్రమ నల్లా కనెక్షన్ల కట్‌



డ్రైనేజీ కనెక్షన్‌ను నిలిపివేస్తున్న జలమండలి మెనేజర్‌ ఆసిఫ్‌ అలీ

లాలాపేట: అక్రమ డ్రైనేజీ, నల్లా కనెక్షన్లపై తార్నాక జలమండలి అధికారులు కొరడా ఝుళిపించారు. గురువారం తార్నాక చౌరస్తాలోని డెక్కన్‌ ఫామ్‌ రెస్టారెంట్‌, హెచ్‌పీ పెట్రోల్‌ బంక్‌లకు డ్రైనేజీ, నల్లా కనెక్షన్‌లను కట్‌ చేశారు. ఇటీవలే తార్నాక వాటర్‌ వర్క్స్‌ మెనేజర్‌గా వచ్చిన మహమ్మద్‌ ఆఫీస్‌ అలీ తార్నాక ప్రాంతంలోని నల్లా, డ్రైనేజీ కనెక్షన్‌లపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. డెక్కన్‌ హోటల్‌, పెట్రోల్‌ బంక్‌ నిర్వాహకులు అనేక రోజులుగా అక్రమంగా వినియోగించుకుంటున్నారనే సమాచారంతో సిబ్బందితో వెళ్లి వారి అక్రమ కనెక్షన్‌లను కట్‌ చేయించారు.

రోడ్డుకు మరమ్మతులు చేయండి



బౌద్ధనగర్‌: అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేయించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని బస్తీవాసులు కోరుతున్నారు. డివిజన్‌లోని రోడ్‌ నంబర్‌ 6లో రెండు నెలల క్రితం డ్రైనేజీ పైప్‌లైన్‌ పనుల నిమిత్తం రోడ్డు తవ్వారు. పనులు పూర్తి అయిన తరువాత రోడ్డు వేయకుండా వదిలేసి వెళ్లిపోయారు. దీంతో నిత్యం రాకపోకాలు సాగించే ప్రయాణికులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. నెలలు గడుస్తున్నా కూడా రోడ్డు వేయకుండా అధికారులు చూపుతున్న అలసత్వాన్ని వీడి వెంటనే నూతన రోడ్డు వేయాలని కోరుతున్నారు.

25 రోజులు / రూ. 9 కోట్లు బకాయిలు



ఆస్తిపన్ను చెక్కులు స్వీకరిస్తున్న డిప్యూటీ కమిషనర్‌ సుభాష్‌రావు

- ఆస్తిపన్ను వసూలుకు స్పెషల్‌ డ్రైవ్‌
- బకాయిదారులకు రెడ్‌ నోటీసులు
- ఆస్తిపన్ను వసూలు ప్రక్రియ వేగవంతం
- సికింద్రాబాద్‌ సర్కిల్‌ టార్గెట్‌ రూ.28 కోట్లు

సికింద్రాబాద్‌: ఆస్తిపన్ను వసూల కోసం ఈ ఏడాది జీహెచ్‌ఎంసీ అధికారులు రూపొందించుకున్న ప్రణాళిక తలకిందులైంది. గత ఏప్రిల్‌ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి వివిధ ప్రభుత్వ కార్యక్రమాల సర్వేల్లో నిమగ్నమైన జీహెచ్‌ఎంసీ అధికారులు పన్నుల వసూళ్ల మీద ఎక్కువ దృష్టి సారించలేకపోయారు. కొద్ది రోజుల క్రితం ప్రభుత్వ సర్వే కార్యక్రమాలు మొత్తం ముగించిన అధికారులు, ఉద్యోగులు బకాయి పన్ను వసూలు దిశగా ఉరుకులు పరుగులు పెడుతున్నారు. మార్చి 1వ తేదీ నుంచి బకాయిదారులపై ఉక్కుపాదం మోపేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహిస్తున్నారు.

- వసూలు లక్ష్యం ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.28 కోట్లు ఉండగా ఇప్పటి వరకు రూ.19 కోట్లు వసూలు చేయగలిగారు. మరో రూ.9 కోట్లు 15 వేల గృహాల నుంచి ఆర్థి పన్ను బకాయిలు వసూలు కావాల్సి ఉంది.
- జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్‌ సర్కిల్‌ పరిధిలో 55 వేల గృహాలు ఉన్నట్టు అధికారిక రికార్డులు చెబుతున్నాయి. ప్రభుత్వ భవనాలు, వాటి పన్ను బకాయిలు మినహాయిస్తే రూ.28 కోట్లు ఆస్తిపన్ను రాబట్టాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.
- గత ఆర్థిక సంవత్సరంలో రూ.26 కోట్ల ఆస్తిపన్నును జీహెచ్‌ఎంసీ అధికారులు వసూలు చేయగలిగారు. ఈ ఏడాది అదనంగా మరో రూ.2 కోట్లు వసూలు చేసుకోవాలని లక్ష్యం నిర్దేశించుకున్నప్పటికీ చేరే పరిస్థితులు కనిపించడం లేదు.
- కనీసం గతేడాది వసూలు చేసిన మాదిరి రూ.26 కోట్ల వరకు అయినా ఆస్తిపన్ను రాబట్టాలన్న లక్ష్యంతో ట్యాక్సు విభాగం సిబ్బంది ముందుకు సాగుతున్నారు.
- జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్‌ సర్కిల్‌ డిప్యూటీ కమిషనర్‌ డి.సుభాష్‌రావు మాట్లాడుతూ మార్చి నెలాఖరు నాటికి వసూలు లక్ష్యం చేరుతామని ప్రకటించారు. పెద్దమొత్తంలో బకాయిపడిన వారికి రెడ్‌ నోటీసులు జారీ చేస్తున్నామని చెప్పారు.
- రోజు ట్యాక్సు విభాగం సిబ్బంది, అధికారులు బకాయి దారుల ఇంటి వద్దకు వెళ్లి బకాయిలు చెల్లింపుల కోసం నచ్చజెప్పుతున్నారని అన్నారు. బకాయి దారులు అందరు ఆస్తిపన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. చెల్లింపుల విషయంలో తాము జారీ చేసిన నోటీసులకు స్పందించనట్టయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్‌: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో..రూపాయల్లో...) టమాటా.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 23, బజ్జీమిర్చి 13, క్యాప్సికమ్‌ 33, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 8, క్యారెట్‌ 15, దొండ 45, గుండుబీన్స్‌ 45, గింజ చిక్కుడు 40, మొరంగడ్డ 35, కందగడ్డ 55, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4-5, ముల్లంగి 5-6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

8న ఆప్‌ రాష్ట్ర కార్యాలయంలో ఇఫ్తార్‌

కవాడిగూడ: పవిత్ర రంజాన్‌ మాసాన్ని పురస్కరించుకొని మార్చి 8వ తేదీన ఆప్‌ రాష్ట్ర కార్యాలయంలో ఇఫ్తార్‌ ఏర్పాటు చేస్తున్నట్లు ఆప్‌ మైనార్టీ విభాగం రాష్ట్ర నాయకుడు అబ్దుల్‌ సలీం తెలిపారు. గురువారం దోమలగూడలోని రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఉపవాసం ఉండే ముస్లింలతో పాటు కుల, మతాలకు అతీతంగా ఇఫ్తార్‌లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆమ్‌ మహిళా విభాగం నాయకురాలు యమునా గౌడ్‌, డాక్టర్స్‌ విభాగం నాయకురాలు లక్ష్మనాయుడు, మైనార్టీ విభాగం నాయకులు అజీమ్‌బేగ్‌, షాబాజ్‌ఖాన్‌ తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తి బృందాలకు ప్రతిష్టాత్మక స్మార్ట్‌ పోలీసింగ్‌ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఆర్‌పీఎఫ్‌ డివిజనల్‌ చీఫ్‌ సెక్యూరిటీ ఆఫీసర్‌ దేశష్మిత చటోపాధ్యాయ బెనర్జీ

సికింద్రాబాద్‌: దక్షిణ మధ్యరైల్వే సికింద్రాబాద్‌ డివిజన్‌ రక్షకదళానికి చెందిన మహిళా శక్తి బృందాలకు ప్రతిష్టాత్మక ఫెడరేషన్‌ ఆఫ్‌ ఇండియన్‌ ఛాంబర్స్‌ ఆఫ్‌ కామర్స్‌ అండ్‌ ఇండస్ట్రీ (ఎఫ్‌ఐసీసీఐ) స్మార్ట్‌ పోలీసింగ్‌ అవార్డు లభించింది. దేశ వ్యాప్తంగా ఉన్న ఆర్‌పీఎఫ్‌ బృందాల్లో ఇక్కడి దళాలు చట్టాలను పకడ్బందీగా అమలు చేయడం, రైల్వే నెట్‌వర్క్‌తో పోటీపడి ప్రయాణికులకు భద్రత కల్పించడంలో అసాధారణమైన ప్రతిభాపాటవాలను కనబరిచినందుకు స్మార్ట్‌ పోలీసింగ్‌ అవార్డు దక్కించుకున్నారు. ఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో స్మార్ట్‌ పోలీసింగ్‌ అవార్డును సికింద్రాబాద్‌ డివిజన్‌ ఆర్‌పీఎఫ్‌ చీఫ్‌ సెక్యూరిటీ కమిషనర్‌ దేబష్మిత చటర్జీ బెనర్జీ అందుకున్నారు. ఎఫ్‌ఐసీసీఐ సెక్యూరిటీ కమిటీ అడ్వయిజర్‌ జీకే పిళ్లై చేతుల మీదుగా అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా దేబష్మిత చటర్జీ బెనర్జీ మాట్లాడుతూ.. తమ డివిజన్‌కు చెందిన మహిళా శక్తి బృందం 16 రాష్ట్ర పోలీసు దళాలు, 6 కేంద్ర సాయుధ పోలీసు దళాలు, ఇతర 23 సంస్థల భద్రత బలగాలతో పోటీపడి స్మార్ట్‌ పోలీసింగ్‌ అవార్డు చేజిక్కించుకోవడం గర్వంగా ఉందన్నారు.

బీఆర్‌ఎస్‌ నేతకు మాతృవియోగం



శకుంతలాదేవి పార్థీవ దేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట: వ్యాపార వేత్త, బీఆర్‌ఎస్‌ నాయకులు కొత్తపల్లి మధుసూదన్‌రావు మాతృమూర్తి శకుంతలాదేవి (100) గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని.. వారి నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. కొత్త పల్లి మధుసూదన్‌రావు కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బాధితులకు న్యాయం జరిగేలా చూడండి



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు సమస్యను వివరిస్తున్న బాధితులు

సనత్‌నగర్‌: చిట్టీల పేరుతో ప్రజలను మోసం చేసిన పుల్లయ్య బాధితులకు న్యాయం చేయాలని సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ పోలీసు అధికారులను ఆదేశించారు. సనత్‌నగర్‌లోని బీకేగూడలో నివసించే పుల్లయ్య గత కొన్ని సంవత్సరాలుగా చిట్టీలను నడుపుతూ ఇటీవల పరారీ అయ్యాడు. దీంతో పుల్లయ్య వద్ద చిట్టీలు కట్టిన సనత్‌నగర్‌, దాసారం బస్తీలకు చెందిన బాధితులు వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి తాము నిత్యం వివిధ రకాల పనులు చేసుకుంటూ చిట్టీలు కట్టామని, పుల్లయ్య నమ్మించి మోసం చేశాడని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే ఎస్సార్‌నగర్‌ ఇన్‌స్పెక్టర్‌, ఇతర పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ నాయకులు కరుణాకర్‌రెడ్డి, రాజేష్‌ముదిరాజ్‌, పీయూష్‌గుప్తా, ఆకుల రాజు, సాయి, కృష్ణమూర్తి, తిమ్మప్ప, దిలీప్‌, మల్లేష్‌ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యకు ఎంతో ప్రాముఖ్యత



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్‌ యాదవ్‌ తదితరులు

లాలాపేట: వైద్య విద్యకు ఎంతో ప్రాముఖ్యత ఉందని రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్‌ యాదవ్‌ అన్నారు. నేషనల్‌ ఫార్మసీ ఎడ్యుకేషనల్‌ డే, ప్రొఫెసర్‌ ఎమ్‌ఎల్‌ స్రాఫ్‌ 123వ జయంతిని పురస్కరించుకుని గురువారం తార్నాకలోని సరోజినీ నాయు డు వనితా ఫార్మసీ మహా విద్యాలయంలో 'ఫార్మా అన్వేషణ్‌-2025 సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. వైద్య వృత్తికి సమాజంలో ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. ఫార్మసీ రంగంలో పుష్కలమైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు వైద్య, ఫార్మసీ విద్యను అభ్యసించేందుకు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో మహా విద్యాలయ చైర్మెన్‌ డా. బి.ప్రభ శంకర్‌,వీపీ సింగ్‌, జైనాయుడు, డా. ఎం వెంకటరమణ,బాల్‌రాజ్‌ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈఎంసి టు పుస్తకాన్ని ఆవిష్కరించారు.

యువకుడి అదృశ్యం



షానూర్‌

అడ్డగుట్ట: ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు.లాలాగూడ ఎస్‌ఐ నాగరాణి తెలిపిన మేరకు.. శాంతినగర్‌లోని ఆర్యనగర్‌ ప్రాంతానికి చెందిన మహ్మద్‌ షానూర్‌(22) ఈసీఐఎల్‌లో బజాజ్‌ ఫైనాన్స్‌లో పని చేస్తున్నాడు. ఈ నెల 1న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన షానూర్‌ ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు షానూర్‌కు ఫోన్‌ చేయగా స్విచ్ఛాఫ్‌ రావడంతో తెలిసిన వారిని, స్నేహితులను వాకబు చేశారు. అయినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో షానూర్‌ తల్లి షమీమ్‌ లాలాగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

వృద్ధురాలు..



లక్ష్మీబాయి

బౌద్ధనగర్‌: వారాసిగూడ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఓ వృద్ధురాలు అదృశ్యమైంది. ఎస్‌ఐ సుధాకర్‌ తెలిపిన మేరకు.. ఎంసీహెచ్‌ కాలనీలోని ఈస్ట్‌ పార్శిగుట్టలో లక్ష్మీ బాయి(68) తన కుటుంబసభ్యులతో కలిసి ఉంటోంది. బుధవారం రాత్రి భోజనం చేసి పడుకున్న ఆమె నిద్రపోయింది. అర్ధరాత్రి సమయంలో కుమారుడు లేచి చూసే సరికి తల్లి కనిపించలేదు. పరిసర ప్రాంతాల్లో ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో గురువారం వారాసిగూడ పోలీస్‌స్టేషన్‌లో కుమారుడు రామేశ్వరరావు ఫిర్యాదు చేశాడు.

ఇంట్లో గొడవపడి...



కార్తీక్‌

అడ్డగుట్ట: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన తుకారాంగేట్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ శంకర్‌ నాయక్‌ తెలిపిన ప్రకారం. తుకారాంగేట్‌ ప్రాంతానికి చెందిన బురుగు కార్తీక్‌(25) ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో భార్య స్థానికంగా ఉండే తన సోదరి ఇంటికి వెళ్లింది. మరుసటి రోజు తిరిగి తన ఇంటికి వచ్చే సరికి భర్త కార్తీక్‌ కనిపించలేదు. దీంతో తెలిసిన వారిని, బంధువులను వాకబు చేసిన ఫలితం లేకుండా పోవడంతో భార్య మేఘన బుధవారం తుకారాంగేట్‌ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది.

పీహెచ్‌డీ సీట్లు పెంచాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీ సీట్ల సంఖ్య పెంపునకు రాష్ట్ర గవర్నర్‌, చాన్స్‌లర్‌ జిష్ణుదేవ్‌ వర్మకు లేఖను రాసినట్లు తెలంగాణ డెమొక్రటిక్‌ స్టూడెంట్స్‌ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు జి.విజయ్‌ నాయక్‌ గురువారం తెలిపారు. 465 సీట్లకు 9000 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసినా ఓయూ అధికారులు సీట్ల సంఖ్య పెంపునకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. సీట్ల సంఖ్యను పెంచే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

మార్కెట్‌కు మంచినీటి సదుపాయం కల్పిస్తాం



సమావేశంలో పాల్గొన్న కంటోన్మెంట్‌ సీఈఓ మధుకర్‌ నాయక్‌

సీఈఓ మధుకర్‌ నాయక్‌

కంటోన్మెంట్‌: నగరంలోనే అతిపెద్ద కూరగాయల మార్కెట్‌గా పేరొందిన, బోయిన్‌పల్లిలోని డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కూరగాయల మార్కెట్‌ యార్డుకు కంటోన్మెంట్‌ బోర్డు తరఫున మంచినీటి సదుపాయం కల్పిస్తామని బోర్డు సీఈఓ మధుకర్‌ నాయక్‌ ప్రకటించారు. ఓ వైపు కంటోన్మెంట్‌, మరో వైపు జీహెచ్‌ఎంసీని అనుకుని ఉన్న మార్కెట్‌ యార్డుకు మంచినీటి కోసం పదేళ్లుగా ప్రయత్నాలు చేస్తున్నా, సాధ్యం కాలేదు. ఈ నేపథ్యంలో తాజాగా నూతన మార్కెట్‌ కమిటీ ఆధ్వర్యంలో కమిషన్‌ ఏజెంట్లు కంటోన్మెంట్‌ సీఈఓను కలిసి మార్కెట్‌ సమస్యలపై విన్నవించారు. మార్కెట్‌ యార్డులోని 172 దుకాణాలకు మంచినీటి సదుపాయం కల్పించాలని కోరారు. దీంతో గురువారం నేరుగా మార్కెట్‌ కార్యాలయానికి వచ్చిన సీఈఓ మధుకర్‌ నాయక్‌, వాటర్‌ వర్క్స్‌ సూపరింటెండెంట్‌ రాజ్‌కుమార్‌లు మార్కెట్‌ కమిటీ సభ్యులు, వెజిటెబుల్స్‌, గ్రెయిన్‌ మర్చంట్‌లతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ మార్కెట్‌ యార్డులోని దుకాణాలు ప్రైవేటు భవనాలు అయినందున, ఆయా దుకాణాల యజమానులు బోర్డుకు ఆస్తిపన్ను చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే 75 శాతం మంది పన్ను చెల్లిస్తున్నప్పటికీ, మిగతా వాళ్లు సైతం చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు. మార్కెట్‌ యార్డుకు బోర్డు తరఫున మంచినీటి సరఫరా సదుపాయం కల్పిస్తామన్నారు. వీలైనంత త్వరలో అంచనాలు రూపొందించి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ ఆనంద్‌బాబు, వైస్‌ చైర్మన్‌ దేవేందర్‌, సెలెక్షన్‌ గ్రేడ్‌ సెక్రెటరీ వెంకన్న, కమిషన్‌ ఏజెంట్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షులు సోమ దేవేందర్‌ రెడ్డి, గ్రెయిన్‌ మర్చంట్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షులు గౌతమ్‌ జైన్‌ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరి అరెస్టు



నిందితుల గురించి వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్‌పీ జావెద్‌

సికింద్రాబాద్‌: రైలులో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను సికింద్రాబాద్‌ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం రైల్వే డీఎస్‌పీ ఎస్‌ఎన్‌ జావెద్‌ వివరాలను వెల్లడించారు. బుధవారం సాయంత్రం రైల్వే పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తుండగా 10వ నెంబర్‌ ప్లాట్‌ ఫామ్‌పై అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు గుట్టు రట్టు అయింది. ఒడిశ్శా రాష్ట్రం గణపతి జిల్లాకు చెందిన అనంత రైట్‌ (32), సురేశ్‌ బాద రైట్‌ (27) ఇద్దరూ స్నేహితులు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అదే ప్రాంతానికి చెందిన కిరణ్‌ గంజాయి రవాణా గురించి వివరించాడు. బరంపూర్‌ నుంచి హైదరాబాద్‌కు గంజాయి రవాణా చేస్తే ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ఇస్తామని చెప్పడంతో ఇరువురు అంగీకరించారు. అక్కడి నుంచి 10 కిలోల గంజాయిని వెంట తీసుకుని కోణార్క్‌ ఎక్స్‌ప్రెస్‌ రైలులో సికింద్రాబాద్‌ రైల్వేస్టేషన్‌ చేరుకున్నారు. ప్లాట్‌ఫామ్‌పై కిరణ్‌ ఫోన్‌కాల్‌ కోసం ఎదురుచూస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. నిందితులపై కేసులు నమోదు చేసిన రైల్వే పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు కిరణ్‌ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ఇంటర్‌ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం



సనత్‌నగర్‌: ఇంటర్‌ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఎస్సార్‌నగర్‌ ప్రాంతంలో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులతో సందడి వాతావరణం నెలకొంది. ఒకేచోట ఒకే రోడ్డులో వివిధ కళాశాలల్లో పరీక్షా సెంటర్లు ఉండడంతో రహదారుల్లో విద్యార్థుల హడావిడి కనిపించింది. పరీక్షా కేంద్రంలోకి వెళ్లే ప్రతి ఒక్క విద్యార్థినీ క్షుణ్ణంగా తనిఖీలు చేసి లోపలికి పంపించారు. అవసరమైన వస్తువులను మినహాయించి ఇతరత్రా వస్తువులను తీసుకువెళ్లనీయలేదు. ఇక పరీక్షా నిర్వహణ విధుల్లో పాల్గొన్న సిబ్బంది ఫోన్లను కూడా లోపలికి పంపించలేదు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలుచేశారు. పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేశారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడండి



గురుమూర్తినగర్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న బేగంపేట కార్పొరేటర్‌ మహేశ్వరిశ్రీహరి

సనత్‌నగర్‌: అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు ఇబ్బందులకు లేకుండా చూడాలని బేగంపేట కార్పొరేటర్‌ మహేశ్వరిశ్రీహరి అధికారులకు సూచించారు. డివిజన్‌ పరిధిలోని గురిమూర్తినగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్‌ నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. త్వరిగతిన పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్‌ మేనేజర్‌ రామేశ్వర్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు శ్రీహరి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

సనత్‌నగర్‌: బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం 'బాలబాలికల లైంగిక వేధింపుల నిరోధక చట్టం'పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌ చైర్‌పర్సన్‌ పద్మావతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సాక్షి ఎన్‌జీఓ డైరెక్టర్‌ డాక్టర్‌ అదితి కిషోర్‌ ముఖ్య వక్తగా హాజరై విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ఎలక్ట్రికల్‌ డిపార్ట్‌మెంట్‌ హెచ్‌ఓడీ విద్యాసాగర్‌ మాట్లాడుతూ యువత ఆత్మవిశ్వాసంతో అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌ ప్రిన్సిపాల్‌ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు..

మాజీ మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం



ఉస్మానియా యూనివర్సిటీ: మాజీ మంత్రి హరీష్‌రావుకు పీడీఎస్‌యూ నాయకులు గురువారం వినతి పత్రం అందచేశారు. ప్రభుత్వ విద్యా రంగంపై రాజకీయాలకతీతంగా చర్చించాలని, రాబోవు బడ్జెట్‌లో విద్యకు 20 శాతం నిధులు కేటాయించాలని, వర్సిటీల స్వయంప్రతిపత్తిని కాపాడి, యూజీసీ ముసాయిదాను వ్యతిరేకించాలని, రాష్ట్రంలో ఎన్‌ఈపీ-2020 అమలు చేయకుండా అడ్డుకోవాలని వినతి పత్రంలో కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ, ప్రధాన కార్యదర్శి ఎస్‌.అనిల్‌, రాష్ట్ర ఉపాధ్యక్షులు భాస్కర్‌ పాల్గొన్నారు.